క్లుప్తంగా

వరద బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ



పాయకాపురం(విజయవాడరూరల్): స్పందన సేవాసంస్థ, స్పందన వాకర్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో వరద బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ కార్యక్రమం బుధవారం సాయంత్రం పాయకాపురంలో జరిగింది. రూ.30 వేల విలువ చేసే నిత్యావసర సరుకుల కిట్లను 36 కుటుంబాలకు సంస్థ ప్రతినిధులు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థపక అధ్యక్షుడు ఇమ్మానేని కృష్ణప్రసాద్ మాట్లాడుతూ వరదల్లో సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు నాలుగు విడతలుగా సంస్థ సభ్యుల సహకారంతో నిత్యావసర సరుకులను అందజేశామన్నారు. విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలను అందజేశామని తెలిపారు. బాధిత కుటుంబాలకు ఉచితంగా మెగా వైద్యశిబిరం నిర్వహించి మందులను, కళ్లజోళ్లను పంపిణీ చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు డి.మురళీ, లీగల్ అడ్వైజర్ కె.నరసింహామూర్తి, వి.విమలారాణి, ఎం.అనుపమ, వి.సూరిబాబు, ఎల్.దుర్గా పాల్గొన్నారు.

చెత్త సేకరణకు డస్ట్‌బిన్ల పంపిణీ



పాయకాపురం(విజయవాడరూరల్): తడిచెత్త–పొడిచెత్త సేకరణకు అవసరమైన డస్ట్‌బిన్‌లను విజయవాడ నగర పాలక సంస్థ అందజేస్తుందని 64వ డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోపిరాజు అన్నారు. బుధవారం డివిజన్ లో విఘ్నేశ్వర టవర్స్‌లోని కుటుంబాలకు ప్లాస్టిక్ డస్ట్‌బిన్‌లను అందజేశారు. డస్ట్‌బిన్‌లను ఉపయోగించుకొని పరిశుభ్రతను పాటించాలని ఎస్‌ఐ సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు యరగొర్ల శ్రీరాములు, సిబ్బంది, పాల్గొన్నారు.

మధురంగా సాగిన సంకీర్తనం



విజయవాడ కల్చరల్: కంచికామకోటి పీఠపాలిత శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానం లబ్బీపేట శరన్నవరాత్రులు కార్యక్రమంలో భాగంగా బుధవారం ప్రముఖ సంగీత విద్వాంసుడు పోపూరి గౌరీనాథ్ నిర్వహించిన శాస్త్రీయ సంగీత కచేరి మధురంగా సాగింది. సంగీత మూర్తి త్రయం రచించి స్వరపరచిన దేవీ కీర్తనలు అమ్మా ఆనందదాయనీ, శ్రీ సరస్వతీ, సారసముఖీ, తామ్రలోచని, శ్రీనీలోత్పల వారికే తదితర కీర్తనలను ఆలపించారు. వయోలిన్‌పై పాలపర్తి ఆంజనేయులు, మృదంగంపై సద్గురు చరణ్ సహకరించారు. సంగీత విద్వాంసులు గాయత్రీ గౌరీనాథ్, వేమూరి విశ్వనాథ్, మల్లాది బ్రదర్స్ పాల్గొన్నారు. సంగీత విద్వాంసులను దేవాలయ చైర్మన్ మాగంటి వేణుగోపాల్ సత్కరించారు. మేనేజర్ శర్మ నిర్వహించారు.

వైభవంగా గరుడ వాహన సేవ



విజయవాడ కల్చరల్: లబ్బీపేట శ్రీ పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి వార్ల బ్రహ్మోత్సవం సందర్భంగా బుధవారం స్వామి వారికి అత్యంత ప్రీతిపాత్రమైన గరుడ వాహనమీద పురవీధిల్లో దర్శన మిచ్చాడు. భక్తుల గోవిందనామ స్మరణతో పరిసరాలు ప్రతిధ్వనించాయి. అర్చకులు స్వామి వారిని గరడ వాహనంమీద అలంకరింపజేశారు. పలు ప్రాంతాలలో స్వామి వారిని ఊరేగించి, చతుర్వేదాల పారాయణం చేశారు. ఉదయం జియ్యంగార్ల గోష్టి, భక్తులు కోలాట సేవను నిర్వహించారు. చివరిగా స్వామి వారి కల్యాణ క్రతువును నిర్వహించారు. ధర్మకర్తల మండలి చైర్మన్ మాంగంటి వేణుగోపాల్ దంపతులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చీరల పంపిణీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీదేవీశరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా బుధవారం సాయంత్రం మధురానగర్ వీవీ నరసరాజు రోడ్డులో జనసేన డివిజన్ ఇన్‌చార్జి కెంబూరి కృష్ణ భవాని మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దసరా ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. తొలుత అమ్మవారికి పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నత్తనడకన యూజీడీ పనులు

- మూడు నెలలుగా సా..గుతున్న యూజీడీ పనులు
- అమృత్ పథకం కింద రూ.100 కోట్లు మంజూరు
- గత ప్రభుత్వంలో అండర్ గ్రౌండ్ పైపు లైన్ల పనులు పూర్తి
- ఎన్నికల అనంతరం నిలిచిపోయిన పనులు
- మురుగు నీటి పారుదల లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- రైల్వే శాఖ అనుమతులు తీసుకోవడంలో జాప్యం



నిర్మాణ పనులు నిలిచిపోయిన యూజీడీ పంపింగ్‌స్టేషన్

మధురానగర్(విజయవాడసెంట్రల్): మురుగునీటి పారుదలకు ఆటంకాలు తొలగిపోతున్నాయని ప్రజలు పడిన ఆనందానికి ప్రస్తుత ప్రభుత్వం గండి కొట్టింది. దీంతో మురుగునీరు పోయే మార్గం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడి మురుగు నీరు అక్కడే నిలిచిపోవడంతో దోమల ఉత్పత్తి పెరిగిపోతోంది. ఈ పథకం పనులు ముందుకు సాగుతున్నాయోలేదో అనే అనుమానాలను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

అమృత్ పథకం కింద రూ.100 కోట్లు..

పట్టణంలో మురుగునీటి పారుదల సమస్య ఉన్న ప్రాంతాల్లో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణానికి రూ.100 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో వేగంగా అభివృద్ధి చెందుతున్న గద్దే వెంకట్రామయ్యనగర్‌లో యూజీడీ పనులను అప్పటి ప్రభుత్వం ప్రారంభించింది. జీవీఆర్‌నగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్ వాసులకు ఈ డ్రెయినేజీ వ్యవస్థ వల్ల ప్రయోజనం చేకూరుతుంది. ఈ ప్రాంతాల్లో రోడ్లకు రెండు వైపులా అండర్ గ్రౌండ్ పైపుల ఏర్పాటు పూర్తి చేశారు. ప్రతి ఇంటి నుంచి మురుగు నీరు అండర్ గ్రౌండ్ పైపుల్లోకి వెళ్లేందుకు అవసరమైన ఏర్పాట్లను కూడా గత ప్రభుత్వంలోనే పూర్తి చేశారు. అయితే ఈ పథకం ముగింపు పనులు పూర్తి కాకపోవడతో ప్రజలు నానాయాతన పడుతున్నారు. మురుగు నిలిచిపోవడంతో దుర్వాసన, దోమలు, అంటువ్యాధులో అల్లాడుతున్నారు. చినుకుపడితే వర్షపునీరు, మురుగునీరు రోడ్డుపైకి చేరుకోవటంతో స్థానికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

ప్రస్తుత ప్రభుత్వంలో..

ఇంతలో ఎన్నికలు రావటం ప్రభుత్వం మారటంతో అసలు పంపింగ్ స్టేషన్‌ను పట్టించుకునే వారే కరువయ్యారు.

తుది దశకు చేరుకున్న యూజీడీ పంపింగ్ స్టేషన్ పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువస్తే ప్రజలకు మురుగు నీటి పారుదలలో ఎదురవుతున్న కష్టాలు తీరటంతో పాటు నగరపాలక సంస్థకు ఆదాయం లభించే అవకాశం ఉంది.

రైల్వే శాఖ అనుమతి వస్తే..

బుడమేరు పక్కన నిర్మాణ దశలో ఆగిపోయిన పంపింగ్ స్టేషన్ నుంచి ట్రీట్‌మెంట్ (నీటిశుద్ధి ప్లాంటు) ప్లాంటు మధ్య రైలు పట్టాలు ఉన్నాయి. ఈ పట్టాల కిందగా పైపులైన్ వేసేందుకు రైల్వే శాఖ అనుమతులు కావాలి. ఈ అనుమతుల కోసం గతంలోనే రైల్వేశాఖకు నిర్ణీత డిపాజిట్ కూడా చెల్లించారు. అనుమతి కోసం ఎదురు చూస్తుండగా ఎన్నికలు వచ్చాయి. కాలం గడిచిపోవడంతో డిపాజిట్ గడువు ముగిసి పోయిందని తెలుస్తోంది. మళ్లీ డిపాజిట్ చెల్లించాలా, అదే డిపాజిట్‌పై అనుమతిస్తారా అనే మీమాంసలో అధికారులు ఉన్నారు.

అధికారులు స్పందించాలి..

అధికారులు స్పందించి యూజీడీ పంపింగ్ స్టేషన్, ఇతర పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

మిగిలిన పనులు ఇవీ..

ఇక్కడ యూజీడీ పంపింగ్ స్టేషన్ నిర్మించేందుకు అవసరమైన స్థలం లేదు. స్థలం కోసం రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్, స్థానిక నేతలను అధికారులు కలిసి అడిగారు. అయినప్పటికీ అవసరమైన స్థలం లభించకపోవటంతో అప్పటి ఎమ్మెల్యే మల్లాది విష్ణు జీవీఆర్‌నగర్ ఆచంట వెంకటరత్నం నాయుడు సర్కిల్ సమీపంలో బుడమేరు పక్కన యూజీడీ పంపింగ్ స్టేషన్ నిర్మించాలని అధికారులకు సూచించారు. దీంతో బుడమేరు పక్కన పంపింగ్ స్టేషన్ నిర్మాణ పనులు చేపట్టారు. సంపు, పంపింగ్ స్టేషన్ నిర్మాణ పనులు గతంలోనే తుది దశకు చేరాయి. గత ప్రభుత్వం హయాంలోనే పంపింగ్ స్టేషన్‌ను ప్రారంభించాలని ప్రయత్నించినప్పటికీ సాంకేతిక సమస్యలు, రైల్వే అనుమతులలో జాప్యంవల్ల పనులు పూర్తి కాలేదు.



జీవీఆర్ నగర్‌లో నిర్మించిన సంపు

మలబార్‌లో దీపావళి ప్రత్యేక ఆఫర్లు

లబ్బీపేట(విజయవాడతూర్పు): బంగారు, వజ్రాభరణాల రిటైల్ చైన్‌లలో ఒకటైన మలబార్ పండుగల వేళ ప్రత్యేక దీపావళి ఆఫర్లు ప్రవేశ పెట్టినట్లు విజయవాడ షోరూమ్ హెడ్ ఎం.అర్జున్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంజీరోడ్డులోని తమ షోరూమ్‌లో బుధవారం ప్రత్యేక ఆఫర్లను వివరించారు. బుధవారం ప్రారంభమైన ఆఫర్లు నవంబర్ మూడో తేదీ వరకు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రతి రూ.50 వేల విలువైన బంగారు ఆభరణాల కొనుగోలుపై 200 మిల్లీగ్రాముల బంగారు నాణెం, ప్రీషియస్, అన్‌కట్, పోల్కీ జ్యూవెలరీ కొనుగోలుపై 300 మిల్లీగ్రాముల బంగారు నాణెం, వజ్రాభరణాల కొనుగోలుపై 400 మిల్లీ గ్రాముల బంగారు నాణెంను ఉచితంగా ఇస్తామన్నారు. ఈ ఆఫర్లతో పాటు పది శాతం నగదును ముందస్తుగా చెల్లించడం ద్వారా తమకు నచ్చిన ధనత్రయోదశి ఆభరణాలను ముందుగానే బుక్ చేసుకోవచ్చని సూచించారు.

రోడ్డు పనుల పరిశీలన



మధురానగర్(విజయవాడసెంట్రల్): 32వ డివిజన్ అయోధ్యనగర్ మెయిన్ రోడ్డు, పింగళివారి వీధిలో రోడ్డు మెరుగులు దిద్దే పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఇప్పటికే ఇక్కడ రోడ్డు పనులు పూర్తయ్యాయి. అయితే ఎన్నికలు రావటంతో రోడ్డు ముగింపు పనులు జరగలేదు. ప్రస్తుతం ఈ పనులు తుదిదశకు చేరుకున్నాయి. స్థానిక కార్పొరేటర్ చన్నగిరి రామ్మోహనరావు పేవర్ పనులు పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశించిన సమయంలో పనులు పూర్తిచేయాలని సూచించారు.

అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలి

మాజీ ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాసరావు



శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో పూజలు చేస్తున్న మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాసరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అమ్మవారి ఆశీస్సులు అందరికీ అందాలని ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని మాజీ ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో బుధవారం సాయంత్రం వారు పాల్గొని సరస్వతీ అలంకారంలో ఉన్న శివకామేశ్వరీ అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నవరాత్రి ఉత్సవాలలో ఎంతో మహిమాన్వితమైన శివ కామేశ్వరీ అమ్మవారిని దర్శించుకోవటం ఆనందంగా ఉందన్నారు. ప్రతి ఏటా దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న పీఠం వ్యవస్థాపకులు అవ్వా హేమసుందర వరప్రసాద్‌ను అభినందించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రంతో మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాసరావును పీఠం వ్యవస్థాపకులు సత్కరించారు. వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి గుండే సుందర్‌పాల్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పేరం త్రివేణిరెడ్డి, ఎంఎస్ఆర్, వెంకటేశ్వరరెడ్డి, గొల్ల రంగారావు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్యాభినయం





కూచిపూడి నృత్యాలను ప్రదర్శిస్తున్న కళాకారులు

విజయవాడ కల్చరల్: శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో కనక దుర్గానగర్‌లోని కళావేదిక మీద కళాకారులు ప్రదర్శిస్తున్న అంశాలు రసవత్తరంగా సాగుతున్నాయి. జీ నాగమణి బృందం భక్తి సంగీకర్తతో కార్యక్రమాలు ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యాయి. మీనాక్షి, శ్రీనివాస్, సీహెచ్ అజయ్‌కుమార్, యువ సంగీత కళాకారులు మల్లాది సింధురాగేశ్వరి, బీ సింధు బృంద సభ్యులు వాగ్గేయకార కృతులను ఆలపించారు. సంప్రదాయ నృత్యకార్యక్రమంలో చదలవాడ ఆనంద్, సీహెచ్ ఆనంద్.ఎం.పావని సాత్విక్ మహాదేవేశ్వర్, ఎ.సంతోష్, బీ భవాని, ఎం.వి జయలక్ష్మి, కే పవిత్ర, దీప్తి నరేష్, మాగలూరి త్రినాథాచారి, నాట్యాచార్యుడు ఎస్వీ సత్యనారాయ, పీ మంజూష తమ బృందంలోని చిన్నారులు, సీనియర్ కళాకారులు పలు అంశాలను ప్రదర్శించారు. చక్కని తల్లికి ఛాంగ్‌భళా, ఇదిగో భద్రాద్రి, పలుకుతే నియ తల్లి, బ్రహ్మమొక్కటే, కొండలలో నెలకొన్న కోనేటి రాయుడు వాడు తదితర కీర్తనలనలకు నృత్యాలను అభినయించారు. నిర్వాహకులు కళాకారులకు ప్రశంసాపత్రాలను, లడ్డూప్రసాదాలను అందజేశారు.

ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ నేతకు సతీవియోగం

జ్యోత్స్న మృతదేహం వద్ద నివాళులర్పించిన ప్రముఖులు



జ్యోత్స్న మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, బాబూరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాజస్థాన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ అధ్యక్షుడు, న్యాయవాది సుంకర రాజేంద్ర ప్రసాద్ సతీమణి గుళ్లపల్లి జోత్స్న మృతదేహానికి పలువురు ప్రముఖులు ఘన నివాళులర్పించారు. బుధవారం జ్యోత్స్న మృతదేహం విమానంలో విజయవాడకు చేరుకుంది. సూర్యారావుపేటలోని రాజేంద్ర ప్రసాద్ నివాసంలో ఆమె భౌతికకాయాన్ని ప్రజల సందర్శనార్థం ఉంచారు. వామ పక్ష పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘాలు, మహిళా, కార్మిక సంఘాల ప్రతినిధులు, న్యాయవాదులు, జడ్జిలు, సామాజిక కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వచ్చి జ్యోత్స్న మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జ్యోత్స్న కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఇదే ప్రమాదంలో గాయపడిన న్యాయవాది సుంకర రాజేంద్ర ప్రసాద్‌ను పరామర్శించారు. జ్యోత్స్న భౌతికకాయం వద్ద నివాళులర్పించిన వారిలో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, గద్దె రామమోహన్‌రావు, బోడే ప్రసాద్, వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, చిగురుపాటి బాబూరావు, పార్టీ పూర్వ కార్యదర్శి పి.మధు, ది ఫిలిమ్ సొసైటీ అధ్యక్షుడు గోళ్ల నారాయణరావు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జాతీయ ఉపాధ్యక్షుడు కొల్లి సత్యనారాయణ, నల్లూరి మాధవరావు, బార్ కౌన్సిల్ చైర్మన్ నల్లారి ద్వారకానాథరెడ్డి, ఏపీ హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేట్ ప్రెసిడెంట్ కె.చిదంబరం, బార్ కౌన్సిల్ మాజీ చైర్మన్ గంటారామారావు, బార్ కౌన్సిల్ మెంబర్స్ సుదర్శనరావు, ముప్పాళ్ల సుబ్బారావు, ఎస్.మల్లేశ్వరరావు, కృష్ణారెడ్డి, ఐఎఎల్ జాతీయ అధ్యక్షుడు, బార్ కౌన్సిల్ మెంబర్ చలసాని అజయ్‌కుమార్, మాజీ హైకోర్టు న్యాయమూర్తి ఏపీ శేషశాయి, తెలంగాణ మహిళా న్యాయసలహా కమిటీ కన్వీనర్ సీహెచ్ శైలజ ఉన్నారు.



జ్యోత్స్న కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, తదితరులు

మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు నివాళి

గుళ్ళపల్లి జ్యోత్స్న భౌతిక కాయానికి వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ ఆరోగ్యం గూర్చి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బస్సు ప్రమాద ఘటన దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. ప్రమాదంలో మిగతా న్యాయవాదులు, వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ సభ్యులు క్షేమంగా బయటపడటం సంతోషమే అయినా.. జ్యోత్స్న మృతి తీరని లోటని పేర్కొన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి , వైఎస్సార్ సీపీ తరఫున కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట కార్పొరేటర్ కుక్కల అనిత రమేష్, ఒగ్గు గవాస్కర్, రెడ్డి, కృష్ణవేణి తదితరులు ఉన్నారు.

సరస్వతీ.. నమస్తుభ్యం



శ్రీదత్తసాయి శివకామేశ్వరీపీఠంలో..



సరస్వతీ దేవి అలంకారంలో శ్రీఅంకమ్మతల్లి



రామలింగేశ్వరపేటలో శ్రీసరస్వతీ దేవిగా..



రామలింగేశ్వరపేటలో సామూహిక కుంకుమార్చన



శ్రీదత్తసాయి శివకామేశ్వరీపీఠంలో పూజలు చేస్తున్న అవ్వా హేమసుందర వరప్రసాద్



సరస్వతీ అలంకారంలో శ్యామలాంబదేవి



మధురానగర్ మెయిన్ రోడ్డులో..



శ్రీపార్వతీసమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో

మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీదేవీశరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా బుధవారం అమ్మవారు సరస్వతీ అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవారి జన్మనక్షత్రం కావటంతో పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాలకు చేరుకుని భక్తిశ్రద్ధలతో అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు.

శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో..

అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో బుధవారం శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అమ్మవారిని శ్రీ ధర్మపరిషత్ మహాసంస్థానం ఆధ్వర్యాన సరస్వతీదేవిగా అలంకారం చేసి పూజలు నిర్వహించారు. పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ చేతులమీదుగా లక్ష్మీగణపతి, రుద్రహోమం, ఛండీ హోమం నిర్వహించారు. సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించి విద్యార్థులకు పలకలు, పుస్తకాలు పంపిణీ చేశారు. శ్రీలలితా సహస్రనామ పారాయణం జరిగింది.

రామలింగేశ్వరపేటలో..

రామలింగేశ్వరపేట శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో అమ్మవారిని శ్రీసరస్వతీ దేవిగా అలంకరించి పూజలు చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు తాన్న పూర్ణచంద్రరావు, దుర్గారావు, జగన్ మోహన్‌రెడ్డి తదితరులు పర్యవేక్షించారు

ముత్యాలంపాడులో..

ముత్యాలంపాడు శ్రీ పార్వతీసమేత రామలింగేశ్వర స్వామి దేవాలయంలో అమ్మవారు శ్రీ సరస్వతీ దేవిగా పూజలు అందుకున్నారు. సామూహిక కుంకుమార్చనలు జరిగాయి.

దుర్గాపురంలో..

దుర్గాపురంలో వీరమాచనేని కిషోర్ ఆధ్వర్యాన అమ్మవారిని శ్రీసరస్వతీదేవిగా అలంకారం చేసి పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు కుంకుమార్చనలు జరిగాయి. కార్యక్రమంలో కార్పొరేటర్ వీరమాచనేని లలిత పాల్గొని భక్తులతో కలిసి పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది.

వాడ వాడలా..

సత్యనారాయణపురం బాబూరావు మేడ సెంటర్‌లో గుడిపాటి దత్తు ఆధ్వర్యాన అమ్మవారిని శ్రీ సరస్వతీదేవిగా అలంకారం చేసి పూజలు నిర్వహించారు. మధురానగర్ మెయిన్ రోడ్డు, మధురానగర్ నేతాజీ కాలనీ శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠం, జీవీఆర్‌నగర్‌లో అమ్మవారిని శ్రీ సరస్వతీ దేవిగా అలంకారం చేసి పూజలు చేశారు.

ఘనంగా పుణ్యతిథి మహోత్సవాలు



హోమంలో డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి దంపతులు



సాంస్కృతిక ప్రదర్శనలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రాషిర్డీ ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో షిర్డీసాయినాధుని పుణ్యతిథి మహోత్సవాలు బుధవారం ఏడో రోజుకు చేరుకున్నాయి. సాయినాధునికి క్షీరము, కొబ్బరి నీరుతో అభిషేకం నిర్వహించారు. ఉంద్రాళ్లు, పెసలను నైవేద్యంగా సమర్పించి ప్రత్యేక పూజలు అర్చనలు నిర్వహించారు. లోక కల్యాణార్థం సాయినాథ, గణపతి హోమం వేదపండితులచే జరిగింది. కార్యక్రమంలో మందిర గౌరవాధ్యక్షులు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి దంపతులు పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబావారి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ లభించాలని ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పుణ్యతిథి మహోత్సవాలలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు అలరించాయి. కూచిపూడి నృత్యాలు పేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. అనంతరం ఆలయకమిటీ ఆధ్వర్యాన కళాకారులను జ్ఞాపికలతో సత్కరించారు.

ద్విచక్రవాహనం చోరీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఇంటిముందు పార్కింగ్ చేసిన రాయల్ ఎన్‌ఫీల్డ్ చోరీపై బుధవారం గుణదల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మధురానగర్‌కు చెందిన తోట సురేష్ బీఆర్‌టీఎస్ రోడ్డు ఫుడ్ కోర్టులో హోటల్ నడుపుతున్నాడు. ఈయన ఈనెల 5వ తేదీన వ్యాపారం ముగించుకుని రాత్రి 12 గంటలకు ఇంటి ముందు తన రాయల్ ఎన్‌ఫీల్డ్ ద్విచక్రవాహనం పార్కింగ్ చేశాడు. 6వ తేదీ ఉదయం నిద్రలేచి చూసేసరికి ఇంటి ముందు పార్కింగ్ చేసి వాహనం కనిపించ లేదు. దీంతో చుట్టుపక్కల తెలిసిన వారి వద్ద విచారించినా ఫలితం లేకపోవటంతో గుణదల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సంస్కృతీసంప్రదాయాలను పరిరక్షించుకోవాలి

మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు



జ్ఞాపికలు స్వీకరించిన కళాకారులతో మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): సంస్కృతీసంప్రదాయలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. స్థానిక అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో బుధవారం సాయంత్రం సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని కళాకారులు, చదలవాడ ఆనంద్‌లను జ్ఞాపికతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంత మంచి కార్యక్రమాలను ఏర్పాటు చేసిన శ్రీ ధర్మపరిషత్ మహాసంస్థానమ్ నిర్వాహకులను అభినందించారు. జయశ్రీ కూచిపూడి నృత్య నిలయం, చదలవాడ ఆనంద్ శిష్యబృందం ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ కోశాధికారి అడవికొలను వేణుగోపాల్, ఉపాధ్యక్షుడు జయప్రకాష్ పర్యవేక్షించారు